'ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి'

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయచోటిలో త్వరలో పర్యటన ఉన్న సందర్భంగా శుక్రవారం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అధికారులతో కలిసి మండల పరిధిలోని డి.అబ్బవరం హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి డి.అబ్బవరం హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలిస్తారని చెప్పారు. లే అవుట్‌లో సిమెంటు రోడ్లు, డ్రైయినేజీ కాలువలు, విద్యుత్ పనులను త్వరితగతన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో సిఎం పర్యటన ఏర్పాట్లను పగడ్బందీగా పూర్తి చేసి విజయవంతం చేయాలన్నారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి, అధికారులు

మసకబారుతున్న ప్రభుత్వ వైద్యం

మదనపల్లె డివిజన్ పరిధిలోనే సర్వజన బోధనాస్పత్రే పెద్దాస్పత్రి. ఇక్కడికి ప్రతి రోజూ వెయ్యి నుంచి 1300 మంది వరకూ రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఇలాంటి సర్వజన బోధనాస్పత్రిలో రోజు రోజుకు ప్రభుత్వ వైద్యం మసక బారుతోంది. 30 మంది వైద్యులు ఉన్నా, అధిక సంఖ్యలో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటున్న డాక్టర్లు కమీషన్ కాసుల కోసం కక్కుర్తి పడి పేద రోగులను స్కానింగ్ సెంటర్లకు పంపుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. ముఖ్యంగా 108 అంబులెన్స్ సౌలభ్యాన్ని విరివిగా వాడుకుంటూ అవసరం లేని కేసులను సైతం రెఫర్లకు పంపుతున్నారు. ఈ తరుణంలో పని ఒత్తిడికి గురవుతున్న 108 అంబులెన్స్ డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి పనితీరు.

- చిన్న కేసులను రెఫర్ చేస్తున్న డాక్టర్లు
- 108 అంబులెన్స్ సౌకర్యాన్ని విరివిగా వాడేస్తున్న ప్రభుత్వ వైద్యులు
- పైలెట్లకు పని ఒత్తిడితో ప్రమాదాలకు గురవుతున్న అంబులెన్స్‌లు
- కమీషన్ల కోసం డాక్టర్ల కక్కుర్తి
- పేద రోగుల జేబులు గుల్ల

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధనస్పత్రిలో ప్రస్తుతం 30 మంది వైద్యులు పనిచేస్తున్నారు. అందుకు తగ్గ వైద్య సిబ్బంది, నర్సులు, ఎఫ్ఎన్ఒ, ఎంఎన్ఒలు విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో కావాల్సిన సౌలభ్యాలు, వైద్య పరికరాలు ఉన్నాయి. డాక్టర్లు పనిమీద ధ్యాస లేకుండా మొక్కుబడి వైద్యం చేస్తూ పేద రోగులతో చెలగాటమాడుతున్నారు. ఏ చిన్న కేసు వచ్చిన ఇక్కడ వసతులు లేవని, అందుకు తగ్గ వైద్యులు లేరని వెంటనే తిరుపతికి వెళ్లాలంటూ సూచిస్తున్నారు. తమ వల్ల కాదని కొందరు మొర పెట్టుకుంటే.. ఇక్కడ ఉంటే రోగి ప్రాణాలకు తమది గ్యారెంటీ కాదని, అందుకు మీరు ఒప్పుకున్నట్లు సంతకాలు చేస్తే ఇక్కడే పెట్టుకుంటామని భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో రోగి బంధువులు కుటుంబ సభ్యులు బతుకు జీవుడా అంటూ ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కొంతమంది వైద్యులు స్కానింగ్‌లు తీసుకొస్తే సరైన వైద్యం చేస్తామంటూ స్కానింగ్ సెంటర్లతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని చీకటి వ్యాపారాలకు తెర లేపుతున్నారు. సంబంధిత స్కానింగ్ సెంటర్ నుంచి ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి పేద రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత నెలలో స్కానింగ్ సెంటర్ బ్రోకర్ డాక్టర్లకు తీసుకొచ్చిన కమీషన్ కవర్లతో పట్టుబడ్డాడు. వైద్య ఉన్నతాధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోక పోవడంతో ప్రభుత్వ వైద్యుల్లో మరింత నిర్లక్ష్యం ఆవహించింది. మదనపల్లె ఆస్పత్రికి వచ్చే కేసులను రెఫర్ పెడుతున్న చిట్టా చూస్తే మతిపోతుంది. జనవరి 1వ తేదీ నుంచి 6వ తేదీ లోపు 28 కేసులను తిరుపతికి రెఫర్ పట్టారంటే ఇక్కడ వైద్యుల పనితీరు ఏ మేర ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. 108 వాహనాలు ఆరు రోజుల వ్యవధిలో 6,642 కిలోమీటర్లు కేవలం మదనపల్లె టూ తిరుపతి ప్రయాణం చేశాయి. మదనపల్లి 108 10 ట్రిప్పులు, నిమ్మనపల్లి 108 ఆరు ట్రిప్పులు, వాల్మీకిపురం 108 ఐదు ట్రిప్పులు, గుర్రంకొండ 108 నాలుగు ట్రిప్పులు, రామసముద్రం 108 మూడు ట్రిప్పులు తిరిగాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడటమే కాకుండా 108 అంబులెన్స్ సిబ్బందిపై తీవ్ర పనిఒత్తిడి పడడంతో అంబులెన్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. జనవరి 5వ తేదీ ఆదివారం నిమ్మనపల్లి మండలం ముస్తూరు గ్రామానికి చెందిన శివ (40) కడుపునొప్పితో మదనపల్లె సర్వజన బోధనసుపత్రికి వచ్చాడు. తూతూ వైద్యం అందించిన అత్యవసర విభాగ వైద్యుడు తిరుపతికి వెళ్లాలని సూచించారు. తమకు ఆర్థిక స్తోమత లేదని చెప్పడంతో 108కు రిఫర్ చేశారు. అర్ధరాత్రి సమయంలో నిమ్మనపల్లి 108లో శివను తిరుపతికి తరలించారు. సాధారణ స్థితిలో నడుచుకుంటూ వచ్చి అంబులెన్స్ ఎక్కిన శివ పరిస్థితి బాగానే ఉన్నా ఎందుకు రెఫర్ చేశారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. రాత్రి దట్టమైన పొగమంచులో బయల్దేరిన 108 అంబులెన్స్ చంద్రగిరి సమీపంలో దారి నడకలో రోడ్డుపై వెళు‍న్న భక్తులపై దూసుకెళ్లడంతో ముగ్గురు మృతి చెందగా, పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ పాపం మదనపల్లె వైద్యులదే అనడంలో సందేహం లేదు. ఇదే కోవలో నెల రోజుల క్రితం కడప జిల్లా నుంచి 108 అంబులెన్స్‌ను సర్వీసింగ్ చేయించుకుని తీసుకొస్తుండగా గువ్వలచెరువు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో మొలకలచెరువు చెందిన పైలెట్ మహేష్ మృతి చెందాడు. ఇలా అక్కడక్కడ 108 అంబులెన్స్ ప్రమాదాలకు గురవుతుండగా ఇందుకు ప్రభుత్వ వైద్యుల రెఫర్లే కారణంగా తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేసి ముఖ్యంగా మదనపల్లె సర్వజన బోధనసుపత్రి వైద్యుల పనితీరుపై విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. ప్రయివేట్ ఆసుపత్రులలో నయమవుతున్న జబ్బులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎందుకు నయం కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు కేవలం జీతాల కోసమే పనిచేస్తున్నారే తప్ప రోగులకు సేవ చేయాలనే తపన లేదని, పైగా అదనంగా ప్రయివేటు ఆస్పత్రి నిర్వహించుకోవడం, మరికొంత కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేసుకోవడంలో నిమగ్నం కావడంతో వారి చూపు అక్కడే ఉంటోంది తప్ప పేద రోగులకు చికిత్స చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించి మదనపల్లె సర్వజన బోధనసుపత్రి వైద్యుల పనితీరుపై దృష్టి సారించాల్సి ఉంది. పేద రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అదే తరుణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాగున్న కేసులను సైతం రెఫర్ చేస్తున్నారు

108ల ద్వారా తిరుపతికి తీసుకు వెళ్లే సౌలభ్యం ఉండడంతో డాక్టర్లు బాగుండే కేసులను సైతం రెఫర్లు పెడుతున్నారు. ఒక వాహనం తిరుపతికి వెళ్లి రావాలంటే ఐదు నుంచి పది గంటల సమయం తీసుకుంటుంది. ఈ సమయంలో ఆ మండలంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే 108లు అందుబాటులో ఉండే అవకాశం లేదు. 108లపై అదనపు పని భారం పడుతుండడంతో సిబ్బంది ఒత్తిడికి గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రెఫర్లు తగ్గించి తమకు ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నాం

- సురేష్, 108 పైలెట్, మదనపల్లె.

వైద్యుల పనితీరుపై సమావేశం నిర్వహిస్తాం

వైద్యుల పనితీరుపై సమావేశాన్ని నిర్వహించి విధి విధానాలు సూచిస్తాం. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాము. సాధ్యమైనంత వరకు రెఫర్లు తగ్గించి ఇక్కడే వైద్యం అందేలా చేస్తాం.

- కోటేశ్వరి, మెడికల్ సూపరింటెండెంట్, సర్వజన బోధనాస్పత్రి, మదనపల్లె.

16 నుంచి సమ్మెలోకి మంగంపేట కార్మికులు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేట బెరైటీస్ కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కారం చూపలేని కారణంగా ఈ నెల 16వ తేదీ నుంచి కార్మిక సంఘాలు సమ్మె చేస్తామని ప్రకటించాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. ఎపిఎండిసి మంగంపేట సంస్థ బ్రాంచ్ ఆధ్వర్యంలో నాలుగు కార్మిక సంఘాలు ఐదు డిమాండ్స్ పరిష్కరించాలని ఎపిఎండిసి అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద దశల వారి ఆందోళనలో భాగంగా భోజన విరామ సమయంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నినాదాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టి నేటికి ఎనిమిది రోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి కార్మిక సంఘాలతో యాజమాన్యం నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని యాజమాన్యానికి తెలియజే శామన్నారు. ఈ మధ్యకాలంలో ఎపిఎండిసి యాజమాన్యం సి, డి గ్రేడ్ టెండర్‌ను పిలవడం జరిగిందని, ఈ టెండర్ సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడేలా ఉందని మండిపడ్డారు. ప్రస్తుతం సి, డి గ్రేడ్ ఒక టన్నుకు రూ.1680 ఉంటే ఎపిఎండిసి యాజమాన్యం మాత్రం 60 లక్షల టన్నుల సి, డి గ్రేడ్ టెండర్ పిలిచిన దానిలో తన్నుకు కేవలం రూ.1188 పెట్టడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ టెండర్ వల్ల సంస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడి దీనిని నమ్ముకుని జీవిస్తున్న సుమారు 700 మంది నిర్వాసిత కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి వెళు తుందని వెంటనే సి, డి గ్రేట్ టెండర్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. ఎపిఎండిసి యాజమాన్యం ప్రతి సంవత్సరం వేలకోట్ల రూపాయలు ఆదాయం గడిస్తోందన్నారు. ఆ లాభాల సొమ్మును ఏం చేశారో చెప్పకుండా ఐదువేల కోట్ల రూపాయలకు సమస్త ఆస్తులను అమ్మాలని చూడడం చాలా దారుణమని వెంటనే ఆ చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం 15వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించుకుంటే 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళామని హెచ్చరించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు మాట్లాడుతూ యాజమాన్యం టెండర్ రద్దు చేయకుంటే ప్రాణాలకు తెగించైనా సంస్థను కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, ప్రాజెక్టు వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, జిల్లా నాయకులు, ఎపిఎండిసి అన్ని కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎపిఎండిసి కార్యాలయం నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రిలే దీక్షలు ప్రారంభంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రమణ

రాయచోటి : రిలే నిరాహార దీక్షల్లో కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ అన్నారు. 36 జిఒను ఇంజినీరింగ్ కార్మికులకు అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో కూర్చున్న ఐదు మంది కార్మికులకు పూలమాలలు వేసి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో వాటర్ సెక్షన్ ఫిట్టర్ ఎలక్ట్రీషియన్లు ఏడు సంవత్సరాల నుండి వేతనాలు పెంచలేదన్నారు. 15 నుండి 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నా కేవలం రూ.15 వేల వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకనుగునంగా కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేసి హెల్త్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్, ఫెన్షన్ గ్రాట్యూటీ, మట్టి ఖర్చులు జీ ఓ లతో క్యాజువల్ లీవులు, క్లాప్ డ్రైవర్ల వేతనాల పెంపుదల కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు శంకరయ్య, దేవా, మల్లికార్జున, ఖాదర్ వలి, శ్రీనివాసులు, అక్బర్, చంద్రశేఖర్, షకీల్ బేగ్ పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ :మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పురపాలక కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేశామని, తమ ప్రభుత్వం వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. పురపాలక శాఖ మంత్రిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పి.వి రమణ, జి.రమణ, ఎ.బాలాజీ, ఎం.వి.రమణ, కోదండమయ్య, బుజ్జమ్మ, కె.ప్రసాద్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రైతులకు సబ్సిడీ యంత్ర పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి

రైతులు ఐసిఐసిఐ బ్యాంక్ వారు సబ్సిడీపై ఇచ్చే యంత్ర పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్ట ణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో రైతులకు 90 శాతం సబ్సిడీతో సోలార్ లైట్ ట్రాప్స్, బ్యాటరీ స్ప్రేయర్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఐసిఐసిఐ బ్యాంకు వారు 90 శాతం సబ్సిడితో సోలార్ లైట్ ట్రాప్స్, బ్యాటరీ స్పేయర్లు ఇవ్వడం జరుగుతుందని, వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు పొందాలన్నారు. బ్యాటరీ స్ప్రేయర్‌ల వల్ల పిచికారి చేసిన మందులను నేరుగా మొక్కలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మొక్కకు మందు బాగా పట్టి మొక్క పెరుగుదల వస్తుందన్నారు. వీటివల్ల రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులందరూ ఐసిఐసిఐ బ్యాంకు వారు సబ్సిడీపై ఇచ్చే యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్‌టిసి ఆదాయంపై ప్రత్యేక దృష్టి

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
నేటి నుంచి 19 వరకు సౌకర్యం
ఐదు డిపోల పరిధిలో 141 స్పెషల్ బస్సులు
ఆర్‌టిసి ఆర్‌ఎం పి.రాము వెల్లడి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నష్టాల్లో ఉన్న ఆర్‌టిసిని లాభాల బాటలోకి తెచ్చేందుకు సంస్థ యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోందని ఆర్‌టిసి ఆర్‌ఎం పి.రాము అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ టికెటేతర ఆదాయానికి కార్గో సర్వీసులు, అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బస్సులు, విహారయాత్రలకు స్పెషల్ బస్సులు నడిపామని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమయ్యామన్నారు. సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని స్పెషల్ బస్సులు నడిపే అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యేక బస్సులకు సాధారణ ఛార్జీలే ఉంటాయని చెప్పారు. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుందని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. పండుగ నేపథ్యంలో విద్యార్థులకు సెలవులు, దైవదర్శనాలు, పండుగ సందడి ప్రారంభం కావడంతో రాకపోకలు పెరిగాయని చెప్పారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, వారి సౌకర్యార్థం అన్నమయ్య జిల్లా నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఉద్యోగరీత్యా హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లినవారు, చదువుల నిమిత్తం అక్కడ ఉన్న విద్యార్థులంతా సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారని తెలిపారు.. ఈనేపథ్యంలోనే అన్నమయ్య జిల్లా నుంచి ఆర్‌టిసి 141 ప్రత్యేక బస్సులు నడిపెందుకు చర్యలు చేపట్టిందన్నారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి-1, మదనపల్లి-2, పీలేరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నామని పేర్కొన్నారు. మదనపల్లి-1 డిపో నుండి అధికంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. రాయచోటి డిపో నుండి 28, రాజంపేట డిపో నుండి 29, మదనపల్లి-2 డిపో నుండి 10, పీలేరు డిపో నుండి 23 బస్సులు ఈ నెల 11 తేదీ నుంచి 19 వరకు నడుపనున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందించేందుకు గానూ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు.

యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ సుధాకర్‌రెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర, విఆర్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 టీములు పాల్గొన్నాయి. క్రీడల్లో గెలుపొందిన సాయి ఇంజనీరింగ్ కళాశాల టీంకు ప్రథమ బహుమతి, కప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీంకు ద్వితీయ బహుమతి, కప్, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఒడిలు, వాలీబాల్ కోచ్ గౌస్ మోదీన్, ఫిజికల్ డైరెక్టర్లు మల్లేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ రోజులలో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు, పేకాట, గుండాట, చెక్క బొమ్మ లాంటి ఆటలపై డబ్బు పెట్టి ఆడడం ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎలాంటి పరిస్థితులలో ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని, కోడి పందేల జూదరులను, కోడి కత్తుల తయారీదారులను, పేకాట శిబిరాల నిర్వాహకులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. కావున ఎవరైనా జిల్లాలో కోడిపందాలు నిర్వహించిన వారికి ఆశ్రమం కల్పించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలని కోరారు ఎక్కడైనా కోడి పందాలు, జూదం ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సంబంధిత పోలీసుస్టేషన్‌లో లేదా డయల్ 100కు సమాచారం తెలియజేయాలని కోరారు.

21న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటన

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 21న చిత్తూరు జిల్లా కేంద్రంలో జరగనున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేద్దామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్న మాదిగ, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎర్రబల్లి రవీంద్ర మాదిగ తెలిపారు. ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, వాటి అనుబంధ సంఘాల ఉమ్మడి చిత్తూరు జిల్లా, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ముఖ్య అతిధులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనకై అభినవ అంబేద్కర్ మహాజన నేత మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. అంబేద్కర్ సామాజిక న్యాయ సిద్ధాంతానికి అనుగుణంగా షెడ్యూల్ కులాలలోని 59 ఉప కులాల వారిగా వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందించాలన్న లక్ష్యంతో పోరాడుతున్నారని పేర్కొన్నారు. 21న చిత్తూరు జిల్లా కేంద్రానికి మిశ్రా వస్తున్న సందర్భంగా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు, తరలివచ్చి వినతి పత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చరణ్ కుమార్, రామమోహన్‌రెడ్డి, ముస్తూరు విశ్వనాథ, నాగేశ్వరరావు, మహేష్, రమణ, శ్రీరాములు, నాగరాజ, అర్జునయ్య, రాము, గండికోట రెడ్డికుమార్, రమణ, కుమార్ మహిళలు రెడ్డమ్మ, మాధవి, సుగుణ, నాగరజమ్మ పాల్గొన్నారు.

నేడు వడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి-రాయచోటి : శనివారం నిర్వహించనున్న స్వాతంత్ర సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎపి వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రెడ్డయ్య, ఉపాధ్యక్షులు కుంచపు రెడ్డయ్య, రామకృష్ణ, పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 1946లో వీరమరణం పొందిన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను కులాలకతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్యసాధనలో వంద శాతం ఫలితాలు సాధించాలి

- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను అత్యంత పటిష్టంగా నిర్వహించి లక్ష్యసాధనలో వంద శాతం ఫలితాలకు కృషి చేయాలని 20 సూత్రాల అమలు కార్యక్రమ ఛైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఛైర్మన్‌ను కలెక్టరేట్ వద్ద కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జెసి ఆదర్శ్ రాజేంద్రన్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో ఛైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లా సమీక్షలో భాగంగా కేంద్ర ప్రాయోజిత పథకాలు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో పురోగతి మీద సమీక్ష నిర్వహించటానికి వచ్చానన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. స్థూలంగా సమీక్షకు సంబంధించి పూర్తి సమాచారం అందించడంలో, వివరించడంలో అధికారుల మధ్య కొంత సమన్వయ లోపం ఉందన్నారు. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకం 1, 2, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం కుసుమ్ వ్యవసాయానికి విద్యుత్ అందించే పథకం, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న యూరియా సబ్సిడీ, జాతీయ ఆహార భద్రత పథకం, గరీబ్ కళ్యాణ అన్న యోజన తదితర అంశాలలో సమగ్రంగా సమీక్షించారు. శాఖల మధ్య సమన్వయంతో పథకాల అమలుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని రూపొందించాలన్నారు. ఉపాధికి సంబంధించి 300 రావాల్సిన వేతనం 259గా ఉంది దాన్ని ఏ విధంగా మెరుగుపరచాలో ఆ దిశగా సరైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల పైబడిన వారికి పనులు కల్పించడం జరిగింది. అందులో 8588 కుటుంబాలు 100 పని దినాలు పూర్తి చేసుకున్నాయి. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి ఏడాది రూ.132 కోట్లు అంచనా కాగా, రూ.102 కోట్లు ఖర్చు చేశారు. రాబోయే రెండు నెలల కాలంలో సాధ్యమైనంత ఎక్కువ పనులు కల్పించి వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సరైన అంచనా నివేదికలు రూపొందించాలన్నారు. పీఎం ఆవాజ్ యోజన సంబంధించి దాదాపు 79,720 గృహాలు మంజూరు కాగా, ఇప్పటికి 37,2502 ఇండ్లు పూర్తి చేసినట్లు తెలుస్తోందన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి మొత్తం 3936 గృహాలు ఉండగా 2112 ఇల్లు పూర్తయి అందులో నివాసం ఉంటున్నట్లు అధికారులు తెలపడం సంతృప్తికరంనారు. పారిశుద్ధ పనులను కూడా మెరుగుపరచాలని సూచించారు. వ్యవసాయానికి డ్రోన్ల సహాయం అంశంలో భవిష్యత్తులో మండలానికి, ప్రతి పంచాయతీకి ఒక డ్రోన్ కేటాయించే లాగున కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సహాయం, అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కార్డులు దాదాపు 5 లక్షలకు పైబడి ఉన్నాయి. తద్వారా 16 లక్షల మందికి లబ్ధి చేకూరుతోంది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దినకర్

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

కళాశాలలో ఆట స్థలం ప్రారంభం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో దివంగత మాజీ జడ్‌పిటిసి గాలివీటి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు గాలివీటి వివేక్‌రెడ్డి చేపట్టిన ఆటస్థలం, స్టేజిని రాజ్యసభ సభ్యులు ఎంపీ మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల మైదానాన్ని ఆటస్థలంగా మార్చిన గాలివీటి వివేక్ రెడ్డిని అభినందించారు. ఇలాంటి దాతలు ముందుకు వస్తే గ్రామం బాగుపడుతుందని అన్నారు.ప్రతి సంవత్సరం ఎంతో ఖర్చుపెట్టి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువతలో మంచి ఉత్సాహాన్ని నింపుతున్న గాలివీటి వివేకానంద రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, అధ్యాపకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాంగౌడ్, మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, వైసిపి నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, వివేక్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

రామాపురం : శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుద్దమాల పంచాయితీ దూదేకులపల్లిలో శుక్రవారం వైసిపి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసింగాను చురుగ్గా ఉంటారని అన్నారు. క్రీడాకారుల కోటా కింద ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సమానమని క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ఆట ఆడాలని ఉద్బోధించారు. ఆయన వెంట వైసిపి యూత్ నాయకులు సుబాహన్, రఫీ, రియాజ్ షాజహాన్ హుస్సేన్, అమీర్ పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబానికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని ప్రముఖ న్యాయవాది నారే రాంప్రసాద్‌రెడ్డి పితృ వియోగం కలిగింది. గురువారం ఆయన తండ్రి గరుడారెడ్డి మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, వైసిపి నాయకులు, టిడిపి మండల అధ్యక్షులు నిజాముద్దీన్, మాజీ ఎంపిపి సహదేవ రెడ్డి, రెడ్డి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ధరణి సత్యనారాయణరెడ్డి, సభ్యులు ఆది నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

మండలంలో సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.30 లక్షలు మంజూరైనట్లు ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. అరవీడు కురుమయ్యగారిపల్లి బిసి కాలనీకి రూ.11లక్షలు, గుండ్లచెరువు కస్పానుంచి దుర్గమ్మగుడి వరకు రూ.10 లక్షలు, గుండ్ల చెరువు భాస్కర్ రెడ్డి గృహం నుంచి ప్రభాకర్ ఇంటి వరకు రూ.4లక్షలు, సీసీపల్లి, పెద్దపల్లికి రూ.5లక్షల వ్యయంతో సిసి రోడ్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు మండ లానికి సిసి రోడ్లు 24 పనుల గాను రూ.2.45కోట్లు మంజూరైటన్లు తెలిపారు. అందులో 24 పనులకు గాను 18 పనులు పూర్తయినట్లు చెప్పారు.సిసి కెమెరా ఏర్పాటు చేయాలని జడ్‌పి నుంచి ఆదేశాల అందినట్లు ఆయన పేర్కొన్నారు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ ఆదేశాల మేరకు కార్యాలయంలోని ప్రతి గదికి, భవ నానికి ప్రహరీ చుట్టూ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఎంపిడిఒ కార్యాలయంలో సిసి కెమె రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు. డిసెం బర్‌లో తనపై జరిగిన దాడి భవిష్యత్తులో ఏ ఒక్క ఎంపిడిఒ పైన కూడా జరగ కుండా ఉండడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

తిరుపతి ఘటనను రాజకీయం చేయడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముక్కోటి ఏకాదశి సందర్భంగా తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతిలో దర్శన టికెట్లను పంపిణీ చేసే సందర్భంలో జరిగిన దురదృష్టకర సంఘటనలను వైసిపి రాజకీయం చేయడం సిగ్గుచేటని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. గతంలో వైసిపి అధికారంలో ఉండంగా విశాఖపట్నం దగ్గర ఎల్జి పాలిమర్స్‌లో 13 మంది చనిపోయారని, కచ్చ లూరులో బోటు ప్రమాదంలో 40 మంది వరకు చనిపోయారని అన్నారు. అన్నమయ్య జిల్లా, రాజంపేటలో అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు తెగిపోయి ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయి 35 మంది ప్రాణాలు వదిలారన్నారు. ఏనాడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో చనిపోయిన వారిని పరామర్శించిన పాపాన పోలేదని, నేడు ఆగమేఘాల మీద తిరుపతికి వచ్చి రాజకీయం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ శంకర, శివకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి-కలికిరి

మండలం కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూ ఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అంజలీదేవి మాట్లాడుతూ స్వామి వివేకానంద కీర్తి భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ బడిందని, దేశ ప్రజలకే కాదు యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. విద్య సమాజానికి మెరుగైన జీవన ప్రమాణాన్ని అంది స్తుందని, దేశ సామాజిక జీవనం బాగుపడితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన జన్మదినాన్ని యువదినోత్సవం గా జరుపుకుంటారని ఆమె విద్యార్థులకు అవగా హన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ఫేస్ పెయింటింగ్, రంగోలి, పరుగు పందెం వంటి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమం లో ఆర్ఆర్‌సి, ఎన్. ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్. గులాబ్‌జాన్, వి.స్వర్ణలత, కె.మాధవి, ఉదయ, లిఖిత, జి.మాధవి, హాజీరా, శైలజ, కీర్తి, అనూష పాల్గొన్నారు.

ఆనంద నిలయానికి నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సహృదయ ఫౌండేషన్ యూఎస్ఎ వారి ఆర్థిక సహకారంతో సోసియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి రూ.25 వేల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లి తాలూకా ఎస్ఐ సి.హరిహర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సహృదయ ఫౌండేషన్ యుఎస్ఎ వారి సహకారంతో రూ.25 వేల విలువగల నిత్యవసర సరుకులు ఇవ్వడం చాలా అభినందనీయమన్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారికి సహాయం చేసిన సహృదయ ఫౌండేషన్ సభ్యులు తాడివాక బిందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సిర్డ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ సహృదయ ఫౌండేషన్ తాడివాక బిందు సహకారంతో మదనపల్లిలో ఉన్న ఆనంద నిలయం వయోవృద్ధుల ఆశ్రమం లో నిత్యావసర సరుకులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ధాత్రి ఆనందనిలయం అధ్యక్షులు డాక్టర్ సంకారపు స్వాతి చక్రపాణి మాట్లాడుతూ మదనపల్లి ఆనంద నిలయంలో ఉన్న వృద్ధులందరికీ ప్రతిరోజు నిత్యాన్నదానం జరుగుతుందని అన్నారు. గత నెలగా అన్నదానం చేయడానికి సరుకులు లేవని తెలియజేయగానే వెంటనే స్పందించిన సిర్డ్స్ సంస్థ సహృదయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిత్యవసర సరుకులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.

మినీ గోకులాలతో పాడిపరిశ్రమ అభివృద్ధి : 'చమర్తి'

మినీ గోకులంను ప్రారంభిస్తున్న చమర్తి జగన్మోహన్ రాజు

ప్రజాశక్తి-వీరబల్లి

మినీ గోకులాలతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. పశువుల మినీ గోకులం షెడ్లను పంచాయతీ సర్పంచ్ నాగార్జునచారి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మట్లి పంచాయతీ ఎల్లంపల్లిలో రైతులు నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అంతటి ప్రాధాన్యత గల రంగం పాడి పరిశ్రమని అన్నారు. పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, పాల దిగుబడులు పెంచేందుకు గతంలో టిడిపి ప్రభుత్వం రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం పథకాలు అన్నింటిని రద్దుచేసి పాడి రైతుల నోట్లో మట్టి కొట్టిందని అన్నారు. షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రాయితీలు చెల్లించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఎపిఒ నాగరాజ్, ఇసి ఆంజనేయులు, పంచాయతి సెక్రటరీ చంద్రుడు, వెటర్నరీ డాక్టర్ నాగరాజ్, వెటర్నరీ జయప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, సర్పంచ్ నాగార్జునచారి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కల్లూరి రామ్మోహన్ రెడ్డి, భాస్కర్ రాజు, నాగరాజు నాయుడు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామంలో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో మినీ గోశాలం ప్రారంభించారు. గ్రామస్తులు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మినీ గోశాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు రాజారెడ్డి, మాజీ సర్పంచ్ వై.మల్లికార్జునరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు:** రైతులకు ఆసక్తి ఉంటే మినీ గోకులాలను మంజూరు చేస్తామని ఎంపిడిఒ జవహర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని గరుగుపల్లి పంచాయతీ గొర్లవానిపల్లి వద్ద మల్లప్ప నాయుడు నిర్మించిన మినీ గోకులాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాలకు ఇప్పటివరకు 55 మినీ గోకులాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 33 పూర్తయ్యాయని మిగతావి నిర్మాణంలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒలు రామచంద్రయ్య, హరిప్రసాద్, ఇసి బాలాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

మినీ గోకులంను ప్రారంభిస్తున్న రూపానందరెడ్డి

వీల్‌చైర్‌కే పరిమితమైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-రామాపురం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తే మంచి జీతంతో పాటు జీవితం బాగుం టుందని అనుకున్న యువకుడు పని వత్తిడి కారణంగా ఆనారోగ్యానికి గురై వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండ లంలోని కుమార్‌పల్లె పంచాయతీ సురకవాండ్లపల్లెకు చెందిన మడక జగన్నాథం ఉన్నత చదువులు చదివి 2015లో టచ్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ ఇండియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరారు. 2020 అమరావతి అనే యువతితో వివాహం జరిగింది. ఆమె కూడా బీటెక్ పూర్తి చేసింది. 2021 వారికి అబ్బాయి జన్మించాడు. జీవితం బాగా సాగిపోతున్న తరు ణంలో జగన్నాథంకు వెన్ను నొప్పితో ఆస్పత్రిలో చూపించుకున్నాడని తెలి పారు. వైద్యులు వెన్నెముకలో రక్తస్రావం అవుతున్నట్లు తెలిపారని చెప్పారు.

భార్య,కొడుకుతో జగన్నాథం

బెంగళూరులోని సెంట్ జోసెఫ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా నయం కాలే దని, రూ. 11 లక్షలు వరకు ఖర్చు చేసినా ఫలితం లేదని వాపోయాడు. వైద్యులు ఉద్యోగ వత్తిడి వల్ల శారీలు ఒత్తిడి వల్ల శరీరం ఈ విధంగా అయిందని, నయంకాదని జీవిత కాలం ఇలానే ఉంటుందని అన్నారు. తమ కు ఎటువంటి ఆదరణ లేదని కుటుంబ పోషణ కష్టంగా మారిందని పేర్కొ న్నారు. చిన్న వయసులోనే వీల్ చైర్‌కు పరిమితం కావడం, తన కుటుంబ భారాన్ని అంతా తన భార్య మోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జాలి చూపి తన భార్యకు చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వేడ ుకుంటున్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి : డిపిఒ

నందలూరు : డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు, సంపద తయారీ కేంద్రాల నిర్వహణల మీద తగు సూచనలు, సలహాలు అందించారు. నందలూరు, పాటూరు పంచాయతీ లలోని సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ఇఒపిఆర్‌డి బి.శ్రీనివాసులు, మండలం లోని పంచా యతీ కార్యదర్శులు, టిడిపి నాయకులు మోడపోతుల రాము పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులు పరిశీలన

వీరబల్లి : మండలంలో ఉన్న ఏడు పంచాయతీలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో వర్మీ కంపోస్ట్ తయారు చేయడం జరుగుతుందని ఇఒపిఆర్‌డి రామ చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండ లంలోని ఉన్న డంపింగ్ యార్డ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట మట్లి, తాటి గుంటపల్లి, డి.రాచపల్లి, ఓదివీడు, పెద్దివీడు, సంఘం వాండ్లపల్లిలో ఉన్న డంపింగ్ యార్డ్ లో వర్మీ కంపోస్టు తయారుచేసి, రైతులకు కేజీ రూ.8, రూ.10 ఇస్తారని అన్నారు. డంపింగ్ యార్డుల్లో వర్మీ కంపోస్ట్ తయారుచేసిన ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతివనం, వ్యవసాయ పంట లకు నాటిన మొక్కలకు అందిస్తూ మండలం ఆద ర్శంగా నిలుస్తుంది అన్నారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో నుంచి చెత్త సేకరణ చేస్తూ తడి, పొడి చెత్త వేరుచేస్తూ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. డంపింగ్ యార్డులో ఉన్న నాడెప్ కంపోస్ట్ ఎరువు పిట్‌లో కింద కొబ్బరి పీచును వేస్తారు. దానిపైన తడి చెత్తను, ఆకులను వేస్తారు. ఇలా నాలుగు లేయ ర్లుగా వేస్తారు. వాటిపైన వానపాములను వేసి గోనె సంచులను కప్పుతారు. ప్రతి రెండురోజులకు ఒకసారి నీటిని చల్లుతారు. ఇలా చేయడం ద్వారా 40 నుంచి 50 రోజుల్లో వర్మీ కంపోస్టు తయారవుతుంది. ఈ ఎరువు పంటలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్‌ను తగ్గించి వర్మీ కంపోస్ట్‌ను వాడడం వల్ల నాణ్యమైన పంటలు చేతికి వస్తాయని ఆయన తెలిపారు.

వీరబల్లి : వర్మీ కంపోస్ట్ తయారీకి సిద్ధంగా ఉన్న డంపింగ్ యార్డ్

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో శ్రీ శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు రంగు రంగుల ముగ్గులతో పాఠశాల ఆభరణాన్ని అలంకరించి, భోగి మంటలు వేసి, నాట్యములు చేస్తూ సంక్రాంతి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించుకున్నట్లు ప్రిన్సిపల్ నాగరాజా పేర్కొన్నారు.ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉండటంతో ముందస్తుగా పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించుకున్నట్లు ఆయన తెలిపారు.

జూనియర్ కాలేజీలో..

వీరబల్లి : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘన ంగా జరిగాయి. కళాశాలలో జరిగిన సంబరాలను అధ్యాపకులు విద్యార్థులు తిలకించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సంక్రాంతిని ప్రతిబింబించే రంగు వల్లులు, గబ్బె ములు,కోలాటం, భోగి మంటలువివిధ కళారూపకాలు, అవ్వ తాత వేషధారణ, సోదమ్మ వేషధారణ, విద్యా ర్థులను ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య మాట్లాడుతూ సంప్రదాయ బద్ధమైన ఏ అంశమైనా రాబోయే తరాలకు ఉన్నతమైన ఆరోగ్యాన్ని, మంచి ఆలోచనా శక్తిని అందించే ఉద్దేశంతో ఉంటా యని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తపస్యలో..

కలికిరి: కలికిరి కె.రెడ్డివారిపల్లెలో తపస్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలను పాఠశాల అధినేత రామాంజులు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు, పతంగులు, గంగిరెద్దులతో, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణం ముస్తాబ యింది. కార్యక్రములో క్యాంపస్ ఇన్‌ఛార్జి యు.శివప్రసాద్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో..

రామాపురం : మన సంప్రదాయాన్ని సంస్కృతిని పండుగలతో తెలిసిపోతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బిట్స్ కళాశాలలో కరస్పాండెంట్ మన్నూరి భాస్కర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలుగువారికి అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు చెన్న కృష్ణారెడ్డి, మదన్ మోహన్, బిట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో..

రైల్వేకోడూరు : పట్టణంలోని సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.వి కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పిల్లలకు భోగి పండ్లు వేయడం, హరిదాసు,సోది చెప్పేవారు, అమ్మవారు, రైతు, గంగురెద్దుల వారు వివిధ వేష ధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు. గొబ్బెమ్మ పాటలకు పిల్లలు వేసిన నృత్యాలు ఆహుతులను అలరిం చాయి. చివరిగా భోగి మంటలను వేసి గాలిపటాలను ఎగరవేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, లక్కాకుల రాహుల్, ఇన్‌ఛార్జి స్నేహలత భారతి, కాంచన, వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాలలో..

మదనపల్లె అర్బన్ : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు. సంక్రాంతి పండుగ పురస్కరించు కుని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది చిట్లా కుప్పను ఏర్పాటు చేసి భోగి మంట వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అద్యాపకులు పాల్గొన్నారు.

కలకడ : భోగిమంట వేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు : సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం

జాతీయ స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నిమ్మనపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ మణికుమార్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నిమ్మనపల్లిలోని ఆదర్శ పాఠశాల నుంచి సీనియర్ విభాగంలో ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.భవ్యశ్రీ, కె.సంధ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 17,18,19, తేదీలలో ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్న నిమ్మనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులను, క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఫిజికల్ డైరెక్టర్ మణికుమార్‌ను ప్రిన్సిపల్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. త్వరలో జరగబోయే జాతీయస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశా లకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-కలకడ : మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 10 గంటలకు జరగవలసిన మండల సర్వసభ్య సమావేశానికి గుడిబండ ఎంపిటిసి జల్లా కృష్ణకుమారి మాత్రమే హాజరయ్యారని, మిగిలిన ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో కోరం లేకపోవడం వల్ల మండలం సర్వసభ్య సమావేశం ఎంపిపి శ్రీదేవి ఆదేశానుసారం వాయిదా వేసినట్లు తెలిపారు. గతంలో కోరం లేకపోవడం వల్ల గత సంవత్సరం అక్టోబర్ 17న జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిన విషయం పాఠకులకు విధితమే. ఈ క్రమంలో రెండో పర్యాయం కూడా కోరం లేకపోవడం వల్ల మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడడం జరిగిందని ఎంపిడిఒ తెలిపారుతిరిగి మండల సర్వసభ్య సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

కోడి పందేలకు అనుమతి లేదు : సిఐ

ప్రజాశక్తి- బి.కొత్తకోట : మండల పరిధిలోని ప్రజలందరూ రాబోవు సంక్రాంతి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని బి.కొత్తకోట సిఐ జీవన్ గంగా ధర్నాథ్ బాబు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు కోడి పందెలకు అనుమతి లేదన్నారు.సంక్రాతి పండుగ ముసుగులో జూదాలు,కోడి పందెలు, జల్లికట్టు లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. పండుగల వేళ ప్రత్యేక బృందాలతో గస్తీ నిర్వహిస్తామని, గత సంఘటనల ఆధారంగా నిఘా ఉంచుతామని తెలిపారు. ఇప్పటికే పాత కేసుల్లో కొందరు నిందితులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివ

నాయీ బ్రాహ్మణుల సామాజిక వర్గ ప్రజల అభి వృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ తెలి పారు. శుక్రవారం పీలేరులో సాక్సో ఫోన్ విద్వాంసులు హసనా పురం ఎర్ర య్య, అంజి ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేషన్ చైర్మన్ మాట్లా డుతూ దివంగత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మొట్ట మొదటిసారిగా నాయీ బ్రాహ్మణులను గుర్తించి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. తదనం తరం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు లభిస్తుందని ఆయన గుర్తు చేశారు. ఆదరణ పథకం ద్వారా రాష్ట్రంలోని కుల సంఘాలకు భరోసా ఇచ్చారని తెలిపారు.33 బిసి సంఘాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేసి, వారి అభివృద్ధికి పాటుపడిన ఘనత చంద్రబాబు నాయుడు దని ఆయన అన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరుకు 56 బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా అలంకారప్రాయంగా మార్చారని ధ్వజమెత్తారు. నాయీ బ్రాహ్మణ సంఘాల వారు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత మనందరికీ ఉందని, అందరూ చదువుకుంటేనే మన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆనంద్, ఇతర నాయకులతోపాటు పీలేరు పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొనారు.

క్రైం కార్నర్

బి.కొత్తకోట పట్టణంలో చోరీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని కరెంట్ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్.వి.ప్రసాద్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. వారు తిరిగి రాగానే తన ఇంటిలో ఉన్న రెండు జతల బంగారు కమ్మలు 12 గ్రాములు, ఒక బంగారు నల్లపూసల చైను 25 గ్రాములు, మొత్తం 37 గ్రాముల బంగారం, పదివేల రూపాయలు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తీసుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ దొంగతనంపై దర్యాప్తు చేసి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని విద్యార్థులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు..మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్ట హమాలీ కాలనీలో నివాసమున్న మహమ్మద్ ఫయాజ్, అద్నాన్ అంగళ్లులోని మిట్స్ కళాశాలలో ఎంబిఎ చదువుతున్నారు. శుక్రవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలోని రామక్క చెరువు కట్టపై ఆర్‌టిసి బస్సు ఢీ కొనడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ఓ ప్రయివేట్ వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మరో విద్యార్థికి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుదాఘాతంతో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం, దేవలచెరువుకు చెందిన ధనంజయరెడ్డి తంబళ్లపల్లె మండలం బలకవారిపల్లెలోని తాత సత్తిరెడ్డి ఇంట్లో ఉంటూ తంబళ్లపల్లిలో ఐటిఐ చదువుతున్నాడు. తన తాతతో కలిసి పేలవారిపెంట నుంచి ట్రాక్టర్‌లో వరిగడ్డి తరలిస్తుండగా మార్గమధ్యంలోని ముద్దులదొడ్డి వద్ద విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌కు తగలకుండా ఎత్తే క్రమంలో ధనంజయ రెడ్డి చేతికి విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించడంతో కోలు కుంటున్నాడు.